సంపుటి : 9
సంచిక : 335
గురువారం
27 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



విశ్వం వాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!

Contact For Ads:
7579339999


ఏడు రైలు మార్గాలు..

## నాలుగు లైన్లుగా విస్తరణ

రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్



**ఢిల్లీ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో రద్దీ ఎక్కువగా ఉండే ఏడు కీలక రైలు మార్గాల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించింది. ఈ మార్గాలను నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. దీనికి సంబంధించి 'ఎక్స్' వేదికగా ఆయన వివరాలు వెల్లడించారు. భవిష్యత్తులో పెరగనున్న ప్యాసింజర్, సరకు రవాణా డిమాండ్‌ను నెరవేర్చేందుకు, తక్కువ ట్రాన్స్‌పోర్ట్ వ్యయం, పర్యావరణహితమైన

మిగతా .. 2లో..

జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా

# 'సంజీవని'

**కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ - ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం**
**వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

**డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం**

సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్,

మిగతా .. 2లో..

ఆ శాఖకు నేను

## సంరక్షకుడిని మాత్రమే

**ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' అవార్డుల కార్యక్రమంలో నారా లోకేష్**



**ముంబై, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల

మిగతా .. 2లో..

కోదాడ వద్ద

## ఘోర రోడ్డు ప్రమాదం

ఆరుగురి మృతి




**కోదాడ గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వార కుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి

మిగతా .. 2లో..

స్థానిక ఎన్నికల్లో కూటమి శ్రేణులు

## సమన్వయంతో పని చేయాలి

ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి



**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి (టీడీపీ-బీజేపీ-జనసేన) ఐక్యంగానే బరిలోకి దిగుతుందని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి స్పష్టం చేశారు. రాజమండ్రిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన ఊరు - మన జెండా' కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ సోము వీర్రాజు,

మిగతా .. 2లో..

రాయలసీమకు

## జగన్ ఏం చేశారు?

**మంత్రి నిమ్మల రామానాయుడు సూటి ప్రశ్న**



**అమరావతి, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు చేసిందేమీ లేని జగన్, ఇప్పుడు నీటిపారుదల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని ద్రోహాన్ని జగన్ రాయలసీమకు చేశారని, ప్రాజెక్టులపై కనీస అవగాహన లేని వ్యక్తి గొడ్డలి పార్టీ నాయకుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ "'రప్ప రప్ప' అంటూ పొట్టేళ్లను నరికినట్లు నరుకుతామని హెచ్చరికలు చేసే

మిగతా .. 2లో..

వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్ సాగుకు

## ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక**
**వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు ఎక్కడా విఘాతం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు చేపట్టిందని వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంటే, వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తగదని అన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల పాలనను ఒకసారి గుర్తు చేసుకోవాలని

మిగతా .. 2లో..

వాస్తవాలు బయటపడతాయనే

## జగన్ సభకు రావడం లేదు

**మంత్రి కొల్లు రవీంద్ర**



**అమరావతి, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్‌నినోపై అసెంబ్లీలో చర్చకు వస్తే వైకాపా ఐదేళ్ల పాలనలోని వాస్తవాలు బయటపడతాయనే జగన్ సభకు రాకుండా ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. చంద్రబాబు ముందుచూపుతో జలాశయాల్లో నీటిని నిల్వ చేయడం వల్లే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొంటున్నామన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. గతంలో పట్టిసీమను విమర్శించిన జగన్.. ఇప్పుడు దాని

మిగతా .. 2లో..

నా బిడ్డ ప్లాన్-బి ఏంటో

## నాకు తెలియదు

కొండా మురళి



**హైదరాబాద్, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త, ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో

మిగతా .. 2లో..

## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు




**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీలో ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. చింతూరు పోలీస్ స్టేషన్‌లో రంపచోడవరం ఓఎస్డీ పంకజ్‌కుమార్ మీనా ఎదుట వారు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ క్రమంగా బలహీనపడుతోందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తున్నట్లు చెప్పారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా పర్సనల్ గార్డ్‌గా పనిచేసిన ముచ్చకి మంగి, కడితి లక్ష్మయ్య, కడితి వెంకి ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో

మిగతా .. 2లో..

భయంకర కరవు పరిస్థితులు ఉన్నా

## చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని సవాల్ విసిరినా సమాధానం లేదన్న జగన్**
**28 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయిందని ఆందోళన**
**చంద్రబాబు మాటలు నమ్మి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన**



**తాడేపల్లి, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు

మిగతా .. 2లో..

ఏడుగురు మత్స్యకారులతో ఫోన్‌లో


## సంభాషించిన ఎంపీ హరీష్

**ఆచూకీ లభ్యతపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం**
**మత్స్యకారుల క్షేమంగా ఉండటంతో గ్రామంలో సంబరాలు**

**అమలాపురం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 23 రోజులుగా అందరూ చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయని, సముద్ర తీరంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా వున్నారన్న సమాచారం ఆనందాన్ని కలిగించిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అన్నారు. ఒడిశాలోని పారాదీప్ తీరంలో ఆచూకీ లభించిన ఏడుగురు మత్స్యకారులతో ఎంపీ హరీష్ ఫోన్ లో సంభాషించారు. జరిగిన ఘటనను అడిగి తెలుసుకున్నారు. అందరి ప్రార్థనలు ఫలించాయని చెప్పారు. తమ కుటుంబ సభ్యులకు అండగా నిలబడ్డామని, ప్రభుత్వం తరపున చేసిన ప్రయత్నాలను, సహాయ సహకారాలను వారికి ఎంపీ హరీష్ వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం ద్వారా రోడ్డు మార్గాన గురువారం ఏడుగురు మత్స్యకారులు స్వగ్రామం చేరతారని తెలిపారు. గల్లంతైన వారు క్షేమంగా ఉండటంతో ఓడలరేవు

మిగతా .. 2లో..

విశ్వం వ్యంగ్యం




## సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్.. అప్రమత్తంగా ఉండాలి : సీపీ సజ్జనర్



**హైదరాబాద్, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొదట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు

మిగతా .. 2లో..

తమ కుమారుడు నిర్దోషి అంటూ

## మీడియా ముందుకు వచ్చిన సాదిక్ తల్లి

**సౌజన్యనే తమ ఇంటికి వచ్చి పెళ్లి ప్రస్తావన తెచ్చిందని వెల్లడి - జగదీశ్ మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ**
**ఆస్తుల ఆరోపణలను ఖండిస్తూ పోలీసులకు ఆధారాలు సమర్పించామన్న నూర్జహాన్**

**కాకినాడ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ తల్లి నూర్జహాన్ బుధవారం తొలిసారిగా మీడియా ముందుకు వచ్చి కీలక విషయాలు వెల్లడించారు. తన కుమారుడి వేధింపుల వల్లే నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకుందన్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. అసలు కథ వేరే ఉందని, సౌజన్యనే తన కుమారుడిని వివాహం చేసుకోవాలని కోరిందని

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్ధవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు.

**వ్యాధుల నియంత్రణకు దోహదం**

కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏడు రైలు మార్గాలు.. నాలుగు లైన్లుగా విస్తరణ

రైల్వే వ్యవస్థ ఏర్పాటుకు ఈ విస్తరణ కీలకమని పేర్కొన్నారు. "దిల్లీ-హావ్‌డా, హావ్‌డా-చెన్నై, చెన్నై-ముంబయి, ముంబయి-దిల్లీ, దిల్లీ-చెన్నై, ముంబయి-హావ్‌డా, దిల్లీ-గువాహటి.. ఈ ఏడు రైలు మార్గాలు హైడెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగం. ఇవి 11 వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. దేశ రైల్వే నెట్‌వర్క్‌లో వీటి వాటా 16 శాతంగానే ఉన్నప్పటికీ.. మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో 41 శాతం రాకపోకలు ఈ మార్గాల్లోనే సాగుతున్నాయి. ఈ మార్గాల్లో ఇప్పటికే కొన్ని చోట్ల నాలుగు లైన్లు ఉన్నాయి. మొత్తం నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించడం ద్వారా ప్రయాణికులు, సరకు రవాణా సామర్థ్యం పెంపు సాధ్యమవుతుంది" అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## సమన్వయంతో పని చేయాలి

రాజానగరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయం మాదిరిగానే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2024లో ప్రజలు అందించిన బలమైన మద్దతును స్థానిక సంస్థల్లోనూ పునరావృతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ క్రమంగా బలోపేతమవుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని... స్థానిక సమరంలో కూటమి జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

# నా బిడ్డ ప్లాన్-బి ఏంటో నాకు తెలియదు

కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. "కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ప్లాన్-ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ప్లాన్-బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను" అని కొండా మురళి వ్యాఖ్యానించారు.

**క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్: రాజగోపాల్‌రెడ్డి**

తన నియోజకవర్గ బిల్లుల కోసమే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అప్పటికే ప్రజాభవన్‌లో కొండా మురళి ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆయన్ను కలిసి మాట్లాడినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తాను సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. కొండా సురేఖపై క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చెప్పినదే తన అభిప్రాయమన్నారు.

## సంరక్షకుడిని మాత్రమే

ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు.

**ఏపీ పెట్టుబడుల రహస్యం ఇదే**

అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు. కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త రంగాల్లో పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాల్లో భారతదేశం ఎంతో సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "రేపటి తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నగరం చరిత్ర సృష్టించబోతోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఏపీలో నిర్మించాలన్నది మా లక్ష్యం. ఈ మార్పులో మీరంతా భాగస్వాములు కావాలి. మేము చేసే ప్రతి తప్పు నుంచి నేర్చుకోవడానికి, రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం" అని యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి లోకేశ్ అన్నారు.

# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు.

**మృతులు వీరే..**

ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు.

**సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి..**

కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

**సీఎం చంద్రబాబు విచారం**

తెలంగాణ రాష్ట్రంలోని కోదాడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు-కంటైనర్ ఢీకొనడంతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన పలువురు మృతి చెందగా...మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదానికి సంబంధించిన సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించేలా తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# రాయలసీమకు జగన్ ఏం చేశారు?

జగన్ నోటి నుంచి రాయలసీమ, ఇరిగేషన్ మాటలు రావడం హాస్యాస్పదం. తన ఐదేళ్ల పాలనలో శ్రీశైలం, పోతిరెడ్డిపాడులకు ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఆయన ఉన్నారు" అని దుయ్యబట్టారు. "సూపర్ ఎల్ నినో ప్రభావంతో గతేడాది 2,000 టీఎంసీలు వచ్చిన శ్రీశైలంకు ఈసారి కేవలం 208 టీఎంసీల నీరే వచ్చింది. ఇందులో మన వాటా 66 శాతమే. అయినా రాయలసీమ తాగునీటి అవసరాల కోసం ప్రతిరోజూ 11,500 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవాలని, 2027 జులై వరకు తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని మే నెల నుంచే రైతులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం" అని మంత్రి వివరించారు. తెలంగాణ విద్యుదుత్పత్తి వల్ల శ్రీశైలం నీరు వృథా అవుతోందన్న జగన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "శ్రీశైలంలో విద్యుదుత్పత్తి చేస్తే ఆ నీరు నాగార్జునసాగర్‌కే వస్తుందన్న కనీస జ్ఞానం ఐదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తికి లేకపోవడం విడ్డూరం. ఆ నీరు కూడా మన తాగునీటి అవసరాలకే ఉపయోగపడుతుంది. అనవసర విద్యుదుత్పత్తిని నియంత్రించాలని ఇప్పటికే కేఆర్ఎంబీకి, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాశాం" అని తెలిపారు.

**జగన్ ఐదేళ్లలో ఏం చేశారు?**

"2019లో 49 సీట్లు ఇచ్చి గెలిపిస్తే రాయలసీమకు ఏం చేశారో జగన్ గుండెల మీద చేయి వేసుకుని చెప్పగలరా?" అని నిమ్మల ప్రశ్నించారు. అంతేకాదు, గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టారు.

శ్రీశైలం: ప్రాజెక్టుకు ప్రమాదం ఉందని సీడబ్ల్యూసీ హెచ్చరించినా ఐదేళ్లలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.203 కోట్లతో మరమ్మతులు చేపట్టింది.

తుంగభద్ర: సీమకు జీవనాధారమైన ఈ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నా పట్టించుకోలేదు. మా ప్రభుత్వం 33 గేట్లను మార్చి 105 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకుంది.

గోరుకల్లు: రిజర్వాయర్ ప్రమాదంలో ఉందని అధికారులు హెచ్చరించినా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. మేము రూ.59 కోట్లతో టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాం.

హంద్రీ-నీవా: ఐదేళ్లలో జగన్ చేయలేని పనులను, మా ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.3,860 కోట్లతో చేపట్టింది. తిరుమల వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు మరో రూ.1,300 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టింది.

వైసీపీ పాలనలో రాయలసీమకు మోసం తప్ప ఏమీ జరగలేదని వారి పార్టీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా చెప్పారని నిమ్మల రామానాయుడు గుర్తుచేశారు.

# మీడియా ముందుకు వచ్చిన సాదిక్ తల్లి

ఆమె తెలిపారు. కాకినాడ జిల్లాలో మీడియాతో మాట్లాడిన నూర్జహాన్, ఈ కేసుకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు చెప్పారు. "సౌజన్య రెండుసార్లు మా ఇంటికి వచ్చింది. సాదిక్‌ను పెళ్లి చేసుకుంటానని చెప్పింది. కానీ మేము ఆ ప్రతిపాదనను నిరాకరించాం. ఒకవేళ జగదీశ్వర్ రెడ్డితో వివాహం జరగకపోయి ఉంటే, సౌజన్యను సాదిక్‌కే ఇచ్చి పెళ్లి చేసేవాడ్నని నూకరాజే స్వయంగా మాతో అన్నారు" అని నూర్జహాన్ వివరించారు. సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి మృతితో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. పైగా, ఈ ఏడాది ఫిబ్రవరి 14న సౌజన్య ఫోన్ చేసి పిలవగా వెళ్లిన సాదిక్‌పై జగదీశ్వర్ రెడ్డి, అతని మనుషులు దాడి చేసి, కత్తితో బెదిరించారని ఆరోపించారు. భర్త సరిగా చూసుకోకపోవడం వల్లే సౌజన్య తన కుమారుడితో సంబంధం కొనసాగించిందని నూర్జహాన్ అన్నారు. సౌజన్య కుమారుడు రియాన్ష్. సాదిక్‌ను 'అబ్బు' అని, సొంత తండ్రిని 'ఇడియట్' అని పిలిచేవాడని ఆమె చెప్పడం గమనార్హం. ఫోన్‌లో సాదిక్ చెప్పే కథలు వింటూ ఆ బాలుడు నిద్రపోయేవాడని తెలిపారు. సౌజన్య తమను తెలుగు ఖురాన్, బురఖా కావాలని అడిగినట్లు కూడా ఆమె వెల్లడించారు. ఆత్మహత్య చేసుకున్న రోజు సాయంత్రం 5:30 గంటలకు సౌజన్య ఫోన్ చేసి రమ్మని పిలిచిందని, అయితే కేరళలో విద్యార్థుల కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండటంతో సాదిక్ తన అకాడమీకి వెళ్లాడని నూర్జహాన్ తెలిపారు. నూకరాజు కుటుంబానికి చెందిన ఆస్తులు గానీ, బంగారం గానీ తమ వద్ద లేవని, తమ బ్యాంకు పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులను పోలీసులకు అప్పగించామని ఆమె స్పష్టం చేశారు. కాగా, ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య ఇటీవల రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. బాలుడు రియాన్ష్ ఒక్కడే ఈ ఘటన నుంచి బయటపడ్డాడు. గోదావరిలో మునిగిపోతున్న అతడిని మత్స్యకారులు కాపాడారు. సాదిక్ వేధింపులు, బ్లాక్‌మెయిల్ కారణంగానే తాము చనిపోతున్నట్లు వారు రాసిన లేఖలు కలకలం రేపాయి. ఈ కేసులో పోలీసులు సాదిక్‌ను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. తాజాగా ఆయన తల్లి చేసిన వ్యాఖ్యలతో ఈ కేసుకు సరికొత్త కోణం తోడైంది.

# చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు

వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ... పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు వర్షాలు లేక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి... తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు.

# సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్.. అప్రమత్తంగా ఉండాలి : సీపీ సజ్జనర్

తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. "బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్ బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని క్లెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్ www.ceir.gov.inలో మొబైల్ IMEI నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి" అని సీపీ సూచించారు.

# జగన్ సభకు రావడం లేదు

ప్రయోజనాలను చూడాలన్నారు. రాయలసీమకు జగన్ ద్రోహం చేశారని, 102 టెండర్లు రద్దు చేశారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బీసీలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోతపై గతంలో పట్టించుకోని వ్యక్తికి ఇప్పుడు మాట్లాడే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. మద్యం రవాణా కుంభకోణంలో వైకాపా నేత కారుమూరి నాగేశ్వరరావు అడ్డంగా దొరికితే.. రాజకీయ ప్రయోజనాల కోసం బీసీ కార్డును వాడుతున్నారని ధ్వజమెత్తారు.

## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

జరిగిన పలు ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల కార్యకలాపాల్లో వీరి పాత్ర ఉందన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున సాయంతోపాటు పునరావాసం, సంక్షేమ పథకాలు, అన్ని సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

## సంభాషించిన ఎంపీ హరీష్

గ్రామంలో గ్రామస్తులు సంబరాలు జరుపుకు

**కోనసీమ మత్స్యకారుల ఆచూకీ లభ్యతపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం**

కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాంకేతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఘటనపై సిఎం మూడు సార్లు సమీక్షించి రెస్క్యూ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. ఏ మాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నేవీ, కోస్ట్ గార్డ్, సెంట్రల్ మెరైన్ విభాగాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం సంప్రదింపులు జరిపింది. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

# ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

మంత్రి సూచించారు. 2026 జూన్ మొదటి వారం నుంచి ఆగస్టు 25వ తేదీ వరకు రాష్ట్రంలో 192.8 మి.మీ. వర్షపాతం నమోదైందని, ఇదే కాలానికి సాధారణ వర్షపాతం 393.7 మి.మీ. కాగా, సాధారణంతో పోలిస్తే 51 శాతం లోటు నమోదైందని మంత్రి తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ పప్పుధాన్యాల సాగులో 23.6 శాతం వృద్ధి నమోదు కావడం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికకు నిదర్శనమని మంత్రి అన్నారు. గత ఏడాది ఆగస్టు 25 నాటికి పప్పుధాన్యాల సాగు 2.16 లక్షల హెక్టార్లు కాగా, ఈ ఏడాది అదే తేదీ నాటికి 2.66 లక్షల హెక్టార్లకు పెరిగిందని తెలిపారు. పంటల వారీగా కంది 1.92 లక్షల హెక్టార్ల నుంచి 2.30 లక్షల హెక్టార్లకు, మినుము / బ్లాక్‌గ్రామ్ 0.17 లక్షల హెక్టార్ల నుంచి 0.30 లక్షల హెక్టార్లకు, పెసలు 0.041 లక్షల హెక్టార్ల నుంచి 0.061 లక్షల హెక్టార్లకు, సోయాబీన్ 0.048 లక్షల హెక్టార్ల నుంచి 0.100 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రధాన పంటల సాగు విస్తీర్ణం వరి - 10.37 లక్షల హెక్టార్లు, కంది - 2.30 లక్షల హెక్టార్లు, వేరుశనగ -1.37 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న - 1.00 లక్షల హెక్టార్లు, మినుము - 0.30 లక్షల హెక్టార్లు, పెసలు - 0.061 లక్షల హెక్టార్లుగా ఉందని తెలిపారు. పత్తి సాగు కూడా గత ఏడాది 25.08.2025 నాటికి 3.96 లక్షల హెక్టార్లు ఉండగా, ఈ ఏడాది 3.97 లక్షల హెక్టార్లకు చేరిందని, స్వల్ప పెరుగుదల నమోదైందని మంత్రి చెప్పారు. సాధారణ సీజన్ లక్ష్యం 5.15 లక్షల హెక్టార్లు అని తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే అధిక స్థాయిలో సాగు నమోదైందన్నారు. రైతుపై భారం వేయడం మా విధానం కాదు... రైతుకు భరోసా ఇవ్వడం మా విధానం. రైతుల పంటకు బీమా రక్షణ, రైతు కుటుంబానికి భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## సిక్కోలు పాలిటిక్స్.. ఎవరికి వారేనా..?

రాజకీయంగా కీలకమైన ఉత్తరాంధ్ర జిల్లాల్లోని శ్రీకాకుళం(సిక్కోలు)లో వైసీపీ నేతల మధ్య సఖ్యత కనుమరుగైంది. ఎవరికి వారుగా రాజకీయ మైలేజీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఇది పార్టీ పరంగా ఇబ్బందికర పరిణామాలకు దారి తీస్తోందన్న అంచనాలు వున్నాయి. దీనిపై తాజాగా వైసీపీ పెద్ద నివేదిక తయారు చేసింది. మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలు వస్తున్న దరిమిలా.. జిల్లాల వారీగా పార్టీ నివేదికలు రెడీ చేసింది. దీనిలో సిక్కోలు చాలా వీక్‌గా ఉందని స్పష్టమైనట్టు నాయకులు చెబుతున్నారు.

వాస్తవానికి శ్రీకాకుళంలో తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, దువ్వాడ శ్రీనివాస్ వంటి ఫైర్ బ్రాండ్ నాయకులు, పైకి కనిపించే నాయకులతో పాటు కనిపించని మరింత మంది నాయకులు వైసీపీకి ఉన్నారు. ఈ నేపథ్యంలోనే వైసీపీ హయాంలో ఈ జిల్లాకు స్పీకర్ పోస్టుతో పాటు మంత్రి పదవులు కూడా దక్కాయి. అయితే.. ఆ ఇమేజ్.. వైసీపీకి ఇప్పటి వరకు ప్లస్ కాలేక పోయింది. పైగా రానున్న భవిష్యత్తులోనూ పార్టీ పరిస్థితి మరింత ఇరకాటంలో పడే అవకాశం ఉందని అంటున్నారు.

**కారణాలు అనేకం..**

సిక్కోలు వైసీపీ రాజకీయాలను అనేక కారణాలు ప్రభావితం చేస్తున్నాయి. ప్రధానంగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా నాయకులు వ్యవహరిస్తున్నారు. జిల్లాస్థాయి ఇంచార్జ్ కి స్థానిక మాజీ మంత్రులు, నాయకులకు పొసగడం లేదు. పైగా స్థానిక ఎన్నికలకు తమకు సంబంధం లేదన్నట్టుగా మాజీ మంత్రులు వ్యవహరిస్తున్నారు. అంతేకాదు.. గత ఎన్నికల్లో పార్టీ తీసుకున్న నిర్ణయాలపై ఆగ్రహంతో ఉన్న నాయకు లు ఇప్పటికీ తమ వైఖరిని మార్చుకోలేక పోతున్నారన్న వాదన వినిపిస్తోంది.

ఈ పరిణామాలనే నివేదికలో స్పష్టం చేశారు. అయితే.. ఇవన్నీ టీకప్పులో తుఫాను మాదిరిగా పోతాయని ఒకరిద్దరు నాయకులు చెబుతుండగా.. కాదు.. ఇవి సీరియస్‌గానే పార్టీని ప్రభావితం చేస్తాయని మరికొందరు అంటున్నారు. మరోవైపు.. దాదాపు నేతలు అందరిపైనా వ్యక్తిగత అంశాలకు సంబంధించి కేసులు వేలాడుతున్నాయి. ఇటీవల తమ్మినేని కుటుంబం తృటిలో అరెస్టు నుంచి తప్పించుకుంది. దువ్వాడపై కేసులు వెంటాడుతున్నాయి. ధర్మాన ప్రసాదరావు కుటుంబంపైనా గనుల కేసు పెండింగులో ఉంది. దీం తో వారంతా బయటకు వచ్చేందుకు కూడా పెద్దగా ఇష్టపడడం లేదు. మరి వైసీపీ పరంగా ఏం చేస్తారన్నది చూడాలి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## కష్టాల కడలి ఈదలేక.. శ్రీశైలంలో ఐదుగురి ఆత్మహత్య



**శ్రీశైలం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకే కుటుంబానికి చెందిన అయిదుగురు శ్రీశైలంలోని ఓ సత్రంలో ఉరేసుకుని బలవన్మ రణానికి పాల్పడిన సంఘటన కల కలం రేపింది. గది నుంచి మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో దుర్వాసన వస్తుండడంతో సిబ్బందికి అనుమానం వచ్చింది. కిటికీ తెరిచి చూడగా.. లోపల ఐదుగురు ఉరికి వేలాడుతూ విగత జీవులుగా కనిపించారు. మృతులు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లికి చెందిన ఆదిలక్ష్మి(50), మల్లీశ్వరి(45), సుధాకర్ (38), శ్రీదేవి(33), మణికంఠ(15)గా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వారంతా బలవన్మరణానికి పాల్పడి మంగళవారం నాటికే రెండు, మూడు రోజులు అయినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**జీవితమంతా ఇబ్బందులే..**

తాడిమర్రి మండలం పెద్దకోట్లకు చెందిన పల్లపు పెద్ద దుబ్బయ్య, సంజమ్మ దంపతులకు ఆదిలక్ష్మి, మల్లీశ్వరి, సుధాకర్, శ్రీదేవి సంతానం. వీరు ఉపాధి నిమిత్తం బత్తలపల్లికి వచ్చి స్థిరపడ్డారు. 20 ఏళ్ల కిందటే ఆదిలక్ష్మి, మల్లీశ్వరిలకు వివాహమైనా.. పుట్టింట్లోనే ఉంటున్నారు. పదేళ్ల కిందట తల్లిదండ్రులు మృతి చెందడంతో.. కుటుంబ బాధ్యతలన్నీ సుధాకర్‌పై పడ్డాయి. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఓ వైపు పేదరికం.. మరోవైపు సోదరి శ్రీదేవి చిన్నతనంలోనే పక్షవాతానికి గురై ఇంటికే పరిమితమైంది. కుటుంబ పోషణ, ఓ సోదరి వైద్యం నిమిత్తం బ్యాంకులు, బయట వ్యక్తుల దగ్గర రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఇటీవలే ఐపీ పెట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. దీనికితోడు చిన్నక్క మల్లీశ్వరి కుమారుడు మణికంఠ కూడా ఇటీవల అనారోగ్యం బారిన పడడం కుటుంబాన్ని మరింత కలచివేసింది.

**వైద్యం కోసం అని చెప్పి..**

పక్షవాతంతో బాధపడుతున్న చెల్లెలు శ్రీదేవికి తిరుపతి జిల్లా విరుపాక్షపురం వద్ద ఆయుర్వేద మందులు ఇస్తారని తెలుసుకున్న సుధాకర్.. గత నెల 28న అక్కలు ఆదిలక్ష్మి, మల్లీశ్వరి, ఆమె కుమారుడు మణికంఠను తీసుకుని బయలుదేరాడు. అదే రోజున శ్రీశైలంలోని ఓ సత్రంలో గది అద్దెకు తీసుకున్నారు. మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. విరుపాక్షపురంలో ఆయుర్వేద మందులు తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది.. అక్కలకు ఉరి వేసి.. మేనల్లుడు మణికంఠతో కలిసి సుధాకర్ ఉరేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

**"నేను వచ్చేదాకా ఎక్కడికీ వెళ్లొద్దు"**

మూడు రోజుల కిందట ఆదిలక్ష్మి తనకు ఫోన్ చేసి "నేను వచ్చేదాకా ఎక్కడికీ వెళ్లవద్దు.. నిన్ను చూడాలని ఉంది" అని చివరిసారిగా మాట్లాడినట్లు ఆమె భర్త రాముడు గుర్తుచేసుకున్నాడు. అదే సమయంలో సుధాకర్ బత్తలపల్లిలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పూజారి రమణకు ఆదివారం ఫోన్ చేసి 'ఆర్థిక ఇబ్బందులతో బతకలేకపోతన్నాం. మీతో మాట్లాడడం ఇదే చివరిసారి" అని చెప్పగా.. ఆయన ఏదైనా ఉంటే మేం సాయం చేస్తామని.. ఇంటికి రావాలని వారించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. బంధువులు, స్నేహితుల సమాచారం ప్రకారం ఆదివారం రోజునే సుధాకర్ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. మరోవైపు, సుధాకర్ కుటుంబం ఉంటున్న సొంతిల్లు కూడా బ్యాంకు తాకట్టులో ఉన్నట్లు తెలిసింది.

### బతుకు భారమై..
## ఒకే కుటుంబంలోని ఆరుగురి ఆత్మహత్య



**త్రదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో.. బతుకు భారమై.. ఒకే కుటుంబంలోని ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదర్శనగర్ పీఎస్ పరిధిలోని విజయపుర సమీపంలో ఉన్న భూతనాల చెరువులో మృతదేహాలు కనిపించడంతో బుధవారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు చెరువులో తేలియాడుతున్న మృతదేహాలను బయటకు తీసి వివరాలు సేకరించారు. మృతులను శోభా జాలగెరి (45), కుమార్తెలు విద్య (16), సువర్ణ (14), శానిక (7), కుమారులు గౌడేష్ (10), వికాస్ (5)లుగా గుర్తించారు. కుటుంబ సభ్యులు కనిపించడం లేదని మృతురాలు శోభా భర్త భీమరాయ.. ఆదర్శనగర పోలీస్ స్టేషన్‌లో ఈనెల 24న ఫిర్యాదు చేశారు. అదే రోజు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమరాయ మద్యానికి బానిసవడం, కుటుంబ పోషణ భారం కావడంతో శోభ అతనితో ఘర్షణపడి పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. తాము ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించి మరీ వెళ్లిపోయిందని చెప్పాడు. సోమవారం ఇంటి నుంచి వెళ్లిన వారు బుధవారం ఉదయం చెరువులో విగత జీవులుగా కనిపించారన్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగళూరులో రూ.15.94 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** బెంగళూరులో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న పది మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.15.94 కోట్ల మత్తు పదార్థాలు స్వాధీనపరచుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్ వెల్లడించారు. హెబ్బాళ, యశ్వంతపుర, యలహంక, హెచ్ఏఎల్., వైట్‌ఫీల్డ్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు. 7,830 గ్రాముల ఎండీఎంఏ, 21 కిలోల గంజాయి, 52 గ్రాముల హైడ్రో గంజాయి, 591 గ్రాముల హాషిష్ ఆయిల్ తదితరాలు స్వాధీనపరచుకున్నామని వివరించారు. విద్యాసంస్థలు అధికంగా ఉండే ప్రదేశాల్లో ఈ సరకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు.

## వాట్సప్ స్టేటస్ చూసి.. రగిలిపోయి హత్య

**బెళగావి, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని, ఆమెతో సన్నిహితంగా ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోను స్టేటస్‌గా పెట్టుకున్న రమేశ హణమంత బంట్రోళి సోమవారం హత్యకు గురయ్యాడు. కర్ణాటకలోని బెళగావి తాలూకా కల్లోళికి చెందిన బసప్ప రామచంద్ర వడేరను పోలీసులు నిందితుడిగా గుర్తించారు. తన భార్య వివాహేతర సంబంధాన్ని గుర్తించిన బసప్ప పలుమార్లు వారిద్దరినీ హెచ్చరించాడు. రమేశ తన భార్యతో కలిసి ఉన్న చిత్రాన్ని వాట్సప్ స్టేటస్‌గా పెట్టుకోవడంతో కొడవలితో దాడి చేశాడు. బాధితుడిని ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు






సత్యం • సమగ్రం • సమాజ బద్ధత
www.viswamvoice.com




**కాకినాడ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్:**
నగర నడిబొడ్డున ఉన్న అత్యంత రద్దీ కూడలి భానుగుడి జంక్షన్‌లో బుధవారం అర్ధరాత్రి తీవ్ర రక్తపాతం చోటుచేసుకుంది. స్థానిక చార్మినార్ టీ సెంటర్ వద్ద ఓ యువకుడిని అతి కిరాతకంగా హతమార్చిన ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.

### అర్ధరాత్రి ఘర్షణ.. ప్రాణాలు తీసిన దాడి

సుధా ఆర్కేడ్ ఎదురుగా ఉన్న 'కే-7 ఫిట్‌నెస్ జిమ్'లో ట్రైనర్‌గా పనిచేస్తున్న కొడమాటి సతీష్ రెడ్డి (30, తండ్రి రామచంద్రరావు) బుధవారం తెల్లవారుజామున సుమారు 02:20 గంటల సమయంలో భానుగుడి జంక్షన్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద ఉన్నాడు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న అతని స్నేహితుడు బందుల సాయికిరణ్ మరియు మరికొందరితో సతీష్ రెడ్డికి తీవ్ర వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన సాయికిరణ్ తన అనుచరులతో కలిసి ఒక్కసారిగా దాడికి దిగాడు. తీవ్ర ఆవేశంలో కర్రతో సతీష్ రెడ్డి గొంతు భాగంలో బలంగా పొడవడంతో తీవ్ర రక్తస్రావమై అతను ఘటనా స్థలంలోనే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు.

### అక్రమ సంబంధం.. ఆర్థిక వివాదాలే కారణమా?

ఈ దారుణ హత్యకు వివాహేతర సంబంధంతో పాటు వీరి మధ్య గత కొంతకాలంగా సాగుతున్న ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత విభేదాలే ప్రధాన కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. పక్కా ప్రణాళిక ప్రకారమే నిందితులు పథకం వేసి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

### పోలీసుల దర్యాప్తు ముమ్మరం.. ప్రత్యేక బృందాల గాలింపు

సమాచారం అందుకున్న వెంటనే కాకినాడ టూ టౌన్ సీఐ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కి తరలించారు. క్రైమ్ సీన్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, భానుగుడి సెంటర్‌లోని ప్రధాన సీసీటీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రధాన నిందితుడు బందుల సాయికిరణ్‌తో పాటు అతని అనుచరులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

### రాజకీయాలకు అతీతంగా


# సేవ చేయడమే మదర్ థెరిసా సందేశం

## ఎన్నికల వరకే రాజకీయాలు... ఆ తర్వాత అందరికీ సంక్షేమం

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** సేవ చేయడమే మదర్ థెరిసా జీవిత సందేశమని రాజమహేం ద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎస్సీ సెల్ టీడీపీ నగర అధ్యక్షులు చాపల చిన్నరాజు ఆధ్వర్యంలో చర్చిపేటలో జరిగిన సేవా మూర్తి మదర్ థెరిసా 115వ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు దుస్తులు, మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. అనం తరం ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మదర్ థెరిసా చేసిన సేవలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలు స్తాయని అన్నారు. సేవా కార్యక్రమాల్లో మనిషి రాజకీయాన్ని, పార్టీని చూడకూడదని పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమై ఉండాలని, ఎన్నికల అనంతరం ప్రజల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపు నిచ్చారు. 2024లో జరిగిన ఎన్నికల్లో తన ఓటమి కోసం పనిచేసిన వైసీపీ నాయకులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు కూడా వారికి సహాయం అందించామని తెలిపారు. "ఎన్నికల వరకు రాజకీయాలు... ఎన్నికలు ముగిసిన తర్వాత సంక్షేమం అందరికీ" అనే ఆలోచనతోనే పనిచేస్తున్నా మని స్పష్టం చేశారు. రాజకీయ విభేదాలు నగర అభివృద్ధికి అడ్డంకిగా మారకూడదని, సమాజం, రాష్ట్రం, నగరం శ్రేయస్సు కోసం అన్ని వర్గాలు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి పనిచేయాలని ఆయన అన్నారు. గతంలో జరిగిన రాజకీయాల కంటే తమ పాలనలో మంచి మార్పు కనిపించాలని, విమర్శలకు విమర్శలతో కాకుండా పనితీరుతో సమాధానం చెప్పాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. చర్చిపేటలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. అతి త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఎటువంటి అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని చెప్పారు. నగరం శాశ్వతమని, రాజకీయ నాయకులు, పదవులు తాత్కాలికమని పేర్కొన్న ఆయన, రాజమహేంద్రవరం నగరానికి ఎటువంటి అపకీర్తి రాకుండా అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. "కుప్పం అంటే చంద్రబాబు నాయుడు, పిఠాపురం అంటే పవన్ కళ్యాణ్ గుర్తుకు వచ్చినట్లే, రాజమహేంద్రవరం అంటే మనందరికీ గర్వకారణంగా నిలవాలి" అని అన్నారు. ఎస్సీ సెల్ టీడీపీ నగర అధ్యక్షులు చాపల చిన్నరాజు మాట్లాడుతూ చర్చిపేటలో 23 సంవత్సరాలుగా మదర్ థెరిసా జయంతి వేడుకలను నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. యంగ్ స్టార్ అసోసియేషన్ ద్వారా తమ సేవా కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నిరంతరం సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. భవాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి, అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు సహాయం అందించడంలో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. గత ఎన్నికల్లో చారిత్రాత్మక మెజారిటీతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను గెలిపించిన ప్రజలు, రానున్న రోజుల్లో మరింత భారీ మెజారిటీతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. రెండు సంవత్సరాల కూటమి పాలనలో ఎమ్మెల్యే ప్రజలకు, నగర అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్జి రాంబాబు, రెడ్డి మనేశ్వరరావు, బుడ్డిగ రవి, రామినీడి మురళీ, శేషు, రత్నం, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.




# నేరాల నియంత్రణకు డ్రోన్లతో పటిష్టమైన భద్రత

**రాజమహేంద్రవరం, నేటివార్త :** తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ప్రజా భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ సర్వ లైన్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లు, జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతాలు, జాతరలు, ర్యాలీలు,ఉత్సవ ప్రదేశాలు, నిర్మానుష్య ప్రాంతాల వద్ద పగలు, రాత్రి వేళల్లో కూడా డ్రోన్ల సహాయంతో నిశిత పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా సేకరించే రియల్‌టైమ్ విజువల్స్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తించడంతో పాటు అత్యవసర సమయాల్లో పోలీసులు తక్షణమే స్పందించే అవకాశం కలుగుతోంది.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపడుతున్న ఈ డ్రోన్ నిఘా చర్యలు నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని జిల్లా పోలీసు యంత్రాంగం తెలిపింది.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద సమాచారం లేదా వ్యక్తుల కదలికలు గుర్తించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో సాంకేతిక ఆధారిత నిఘా వ్యవస్థను మరింత సమర్థవంతంగా



నిర్వహించగలమని తెలిపారు. అత్యవసర సహాయం కోసం :
డయల్ 112 - పోలీస్ ఎమర్జెన్సీ సర్వీస్,
1930 - సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం,
181 - మహిళల సహాయ కేంద్రం,
1098 - బాలల సహాయ హెల్ప్‌లైన్,
1933 - యాంటీ డ్రగ్స్ హెల్ప్‌లైన్.
అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత నంబర్లకు వెంటనే ఫిర్యాదు చేయాలని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలకు సూచించింది.





# మృత్యుఒడికి భర్త.. కటకటాల్లోకి భార్య!



## రామచంద్రపురం హత్య కేసులో మిస్టరీ వీడింది.. నిందితురాలు ఉమాదేవి అరెస్ట్



**రామచంద్రపురం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తను రుబ్బురోలు బండతో దాడి చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భార్య ఉమాదేవిని రామచంద్రపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో తీవ్ర కలకలం రేపిన తంగేటి ఎల్లారావు (46) హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి తదుపరి న్యాయ ప్రక్రియకు సిద్ధమయ్యారు.

**క్షణికావేశంలో దాడి**

పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 24వ తేదీ రాత్రి కుటుంబ కలహాల నేపథ్యంలో ఎల్లారావు, ఉమాదేవి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఉమాదేవి తీవ్ర ఆవేశానికి లోనై లిసందికాలు పొత్రం (రుబ్బురోలు బండ)లితో భర్త తల, వీపు భాగాలపై బలంగా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలతో ఎల్లారావు స్పృహ కోల్పోయినప్పటికీ వెంటనే ఆసుపత్రికి తరలించలేదని దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. మరుసటి రోజు ఉదయం కూడా స్పృహలేని స్థితిలో ఉన్న భర్తకు నీళ్లు తాగించిన అనంతరం ఉమాదేవి ఇళ్లలో పాచి పనులకు వెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు. పనులు ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఎల్లారావులో ఎలాంటి చలనం లేకపోవడంతో ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారణ అయింది. అనంతరం బంధువులకు సమాచారం అందించారు.

**ఫిర్యాదు.. హత్య కేసు నమోదు**

మృతుడి సోదరుడు తంగేటి సూరిబాబు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పోలీసులు క్రైమ్ నెం. 131/2026గా కేసు నమోదు చేశారు. నిందితురాలు ఉమాదేవిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 103(1) కింద హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు**

హత్యాయుధం స్వాధీనం:

దాడికి ఉపయోగించినట్లు భావిస్తున్న సందికాలు పొత్రం (రుబ్బురోలు బండ)ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ:

క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి రక్తపు నమూనాలు, వేలిముద్రలు తదితర ఆధారాలను సేకరించింది. వాటిని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు.

**పోస్ట్‌మార్టం పూర్తి:**

మృతదేహానికి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు.

**రిమాండ్‌కు తరలింపు:**

నిందితురాలిని విచారించిన అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించే ప్రక్రియను పోలీసులు చేపట్టారు.

**తండ్రి మృతి.. తల్లి జైలు.. బాలుడి భవిష్యత్తు ప్రశ్నార్థకం**

ఈ ఘటనతో ఓ కుటుంబం పూర్తిగా ఛిన్నాభిన్నమైంది. తండ్రి ఎల్లారావు మృతి చెందగా.. తల్లి ఉమాదేవి హత్య కేసులో అరెస్టై జైలు పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో పదో తరగతి చదువుతున్న వారి ఏకైక కుమారుడి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం బాలుడి సంరక్షణ బాధ్యతలను మృతుడి సోదరుడి కుటుంబం చూసుకుంటున్నట్లు సమాచారం. క్షణికావేశంలో జరిగిన ఓ ఘర్షణ.. ఒక నిండు ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా ఓ బాలుడి భవిష్యత్తును కూడా అనిశ్చితిలోకి నెట్టింది.

### మదర్ థెరిసా జయంతి సందర్భంగా

# వృద్ధాశ్రమంలో జిల్లా రవాణాధికారి సేవాభావం



**అమలాపురం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ సమాజంలో ఆపన్నులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని జిల్లా రవాణాధికారి పేర్కొన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా ఈదరపల్లిలోని ఎస్.కె. వృద్ధాశ్రమాన్ని బుధవారం ఆయన సందర్శించి అక్కడి వృద్ధులతో ఆప్యాయంగా గడిపారు. వృద్ధాశ్రమంలో నివసిస్తున్న 28 మంది వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వృద్ధులకు అవసరమైన సదుపాయాలు, నిత్యావసర వస్తువులు, ఇతర అవసరాల గురించి వృద్ధాశ్రమం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని వృద్ధాశ్రమానికి 50 కిలోల బియ్యాన్ని, పండ్లను జిల్లా రవాణాధికారి అందజేశారు. ముఖ్యంగా అక్కడ ఉన్న వృద్ధులకు స్వయంగా ఆపిల్ పండ్లను అందిస్తూ వారి ఆరోగ్యం గురించి ఆప్యాయంగా పలకరించారు. వృద్ధులలో కొంతమందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు, ఆశ్రమంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. వృద్ధులతో కొంతసేపు గడిపిన జిల్లా రవాణాధికారి వారి బాధలను విని మానవతా దృక్పథంతో స్పందించారు. ఎలాంటి ఆశలు లేకుండా వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తూ సేవలు అందిస్తున్న వృద్ధాశ్రమం నిర్వాహకురాలు సూర్యకళను జిల్లా రవాణాధికారి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె దివ్యాంగురాలైనప్పటికీ తన వ్యక్తిగత ఇబ్బందులను పక్కనపెట్టి వృద్ధుల కోసం ఆశ్రమాన్ని నిర్వహిస్తూ వారికి సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూర్యకళను శాలువాతో సత్కరించి ఆమె సేవాభావాన్ని ప్రశంసించారు. వృద్ధాశ్రమ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన సదుపాయాల గురించి ఆమెను అడిగి తెలుసుకున్నారు. వృద్ధాశ్రమంలో ఉన్న మానసిక వైకల్యంతో బాధపడుతున్న మహిళను కూడా జిల్లా రవాణాధికారి పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. వృద్ధాశ్రమంలో ఉన్న ప్రతి ఒక్కరినీ సమానంగా చూసుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, వారి అవసరాలను గుర్తించి సాధ్యమైనంత వరకు సహాయం అందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుమారు 80 ఏళ్ల వయస్సున్న ఓ వృద్ధురాలు తన చిన్న కోరికను జిల్లా రవాణాధికారి దృష్టికి తీసుకురాగా, ఆమె కోరిన కోరికను తప్పకుండా నెరవేర్చేందుకు తన వంతు సహాయం చేస్తానని ఆయన ఆప్యాయంగా హామీ ఇచ్చారు. వృద్ధురాలితో ప్రేమగా మాట్లాడి ఆమెను ఓదార్చారు. తన కోరిక తీరుతుందన్న భరోసా కల్పించడంతో వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ దృశ్యం అక్కడ ఉన్న వారిని సైతం భావోద్వేగానికి గురిచేసింది. జన్మనిచ్చిన తల్లిదండ్రులను చిన్ననాటి నుంచి వారు చేసిన త్యాగాలను మరచిపోకుండా, వృద్ధాప్యంలో వారిని ప్రేమగా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా రవాణాధికారి అన్నారు. తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి వచ్చిన సమయంలో వారిని పట్టించుకోకుండా వదిలివేయడం అత్యంత బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలో ఉన్న వారి పరిస్థితులను చూసి తన మనసు బాధతో చలించిపోయిందని అన్నారు. జీవితాంతం పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండాల్సిన పరిస్థితి రావడం సమాజానికి ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. వృద్ధాశ్రమంలో ఉన్న ప్రతి వృద్ధుడికి తనకు చేతనైన సహాయాన్ని అందిస్తూ వారికి అండగా నిలుస్తానని జిల్లా రవాణాధికారి తెలిపారు. ఆశ్రమ నిర్వాహకురాలు సూర్యకళకు కూడా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వృద్ధులకు అవసరమైన సమయంలో వారిని పరామర్శించడం, వారి సమస్యలను తెలుసుకోవడం, సాధ్యమైన మేరకు పరిష్కరించేందుకు సహకరించడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న సూర్యకళ సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. తనకు ఎదురవుతున్న వ్యక్తిగత ఇబ్బందులను లెక్కచేయకుండా వృద్ధులకు ఆశ్రయం కల్పించడం గొప్ప మానవతా సేవ అని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు వీలైనంత మేరకు వృద్ధులు, అనాథలు, దివ్యాంగులు, ఆపన్నులకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. కేవలం పండుగలు, ప్రత్యేక రోజుల్లోనే కాకుండా నిరంతరం మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మదర్ థెరిసా చూపిన సేవా మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా రవాణాధికారి పేర్కొన్నారు. అనాథలు, నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, వృద్ధులకు అండగా నిలిచి వారి జీవితాల్లో కొంతైనా సంతోషాన్ని నింపడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని అన్నారు. మదర్ థెరిసా జయంతి సందర్భంగా వృద్ధాశ్రమాన్ని సందర్శించడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందని చెప్పారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులతో మరింత సమయం గడపడంతో పాటు వారి అవసరాలను తెలుసుకునేందుకు సెప్టెంబర్ 5న మదర్ థెరిసా వర్ధంతి సందర్భంగా మరోసారి ఆశ్రమానికి వచ్చి అందరినీ కలుస్తానని జిల్లా రవాణాధికారి తెలిపారు. ఆ రోజు కూడా వృద్ధుల యోగక్షేమాలను తెలుసుకుని వారికి అవసరమైన సహాయంపై చర్చిస్తానని చెప్పారు. వృద్ధుల ముఖాల్లో చిరునవ్వు చూడటమే నిజమైన సేవకు గుర్తు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి వృద్ధులతో కలిసి ఆప్యాయంగా మాట్లాడటం, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం, పండ్లు అందించడం, నిర్వాహకురాలు సూర్యకళను సత్కరించడం వంటి కార్యక్రమాలు వృద్ధాశ్రమంలో ఆత్మీయ వాతావరణాన్ని నెలకొల్పాయి. తమను పలకరించి తమ సమస్యలు, అవసరాలు తెలుసుకున్న జిల్లా రవాణాధికారికి వృద్ధులు కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వం, సేవాభావం, తల్లిదండ్రుల పట్ల బాధ్యత వంటి విలువలను సమాజంలో మరింతగా పెంపొందించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

### ఉత్కంఠకు తెర..

23 రోజుల తర్వాత క్షేమంగా లభ్యమైన

# ఏడుగురు మత్స్యకారులు ఆచూకీ

## ఆనందం వ్యక్తం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం అందడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి ఈ నెల 3వ తేదీన వేటకు వెళ్లి గల్లంతైన బోటు ఆచూకీ లభించడంతో పాటు, అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడిశాలోని పారాదీప్ తీరానికి చేరుకున్నారని అధికారులు ధృవీకరించినట్లు మంత్రి తెలిపారు. గత 23 రోజులుగా మత్స్యకారుల ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. గల్లంతైన మత్స్యకారుల క్షేమ సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ పరిస్థితిని సమీక్షించారని మంత్రి సుభాష్ వెల్లడించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యల్లో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. బెంగాల్-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారుల ఆచూకీ లభించిందని, ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని సమాచారం అందిన వెంటనే వారిని స్వస్థలాలకు తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే అధికారుల బృందాన్ని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు పంపించి మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం మాకు ఎంతో ఊరటనిచ్చింది. గత 23 రోజులుగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు ఇది సంతోషకరమైన వార్త. ప్రభుత్వం వారి వెంటే నిలబడి, వారిని త్వరితగతిన స్వస్థలాలకు తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తిస్తుంది అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

# 23 రోజుల ఉత్కంఠకు తెర..

- సురక్షితంగా కోనసీమ మత్స్యకారులు
- మృత్యుంజయులై ఒడిశా తీరానికి చేరిన ఓడలరేవు మత్స్యకారులు
- కుటుంబ సభ్యుల్లో ఆనందం..
- మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని సమాచారం
- మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** సముద్రపు అలల ఉగ్రరూపానికి ఎదురొడ్డి మృత్యుంజయులై నిలిచారు కోనసీమ మత్స్యకారులు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి వేటకు వెళ్లి గత 23 రోజులుగా గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడిశాలోని పారాదీప్ తీరానికి చేరుకున్నారు. ఈ విషయం తెలియడంతో గత మూడు వారాలుగా ఆందోళనలో ఉన్న మత్స్యకారుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. రోజూలాగే సముద్రంలోకి వేటకు వెళ్లిన తమ వారు రోజుల తరబడి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తిండి, నిద్ర మాని కడలి తీరంలో ఎదురుచూసిన తల్లులు, భార్యలు, పిల్లల వేదన వర్ణనాతీతంగా మారింది. అయితే అధికారులు, కోస్ట్‌గార్డ్ బృందాలు నిరంతరం గాలింపు చర్యలు చేపట్టడంతో చివరకు ఏడుగురు మత్స్యకారులు పారాదీప్ తీరంలో సురక్షితంగా బయటపడటం కుటుంబ సభ్యుల్లో ఆనందాన్ని నింపింది. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారనే సమాచారం అందిన వెంటనే అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఓడలరేవు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మిఠాయిలు తినిపించి ధైర్యం చెప్పారు. అనంతరం మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడితో ఫోన్‌లో మాట్లాడి, బాధిత కుటుంబ సభ్యులు మరియు మత్స్యకారులతో మాట్లాడించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, త్వరలోనే మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి, జిల్లా అధికార యంత్రాంగం గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు. ఒడిశా ప్రభుత్వంతో, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ 23 రోజులపాటు యంత్రాంగం నిర్విరామంగా గాలింపు చర్యలు చేపట్టిందన్నారు. మత్స్యకారుల ప్రాణాల రక్షణకు తక్షణమే స్పందించి గాలింపు చర్యలను వేగవంతం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి స్థానిక ప్రజల తరఫున ఎమ్మెల్యే ఆనందరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పారాదీప్‌లో ఉన్న ఏడుగురు మత్స్యకారులను త్వరితగతిన స్వస్థలాలకు చేర్చేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు, ఎంఆర్వో, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# తిమ్మరాజుపేటలో మంచినీళ్ల లేక అల్లాడుతున్న ప్రజలు

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- పనిచేయని త్రాగునీటి మోటర్లు
- చేతి పంపులు, నేల బావిలే దిక్కు
- చోద్యం చూస్తున్న అధికారులు



**కోటనందూరు, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో పాత కొట్టాం పంచాయతీ పరిధిలో తిమ్మరాజుపేట గ్రామంలో గత మూడు నెలల నుండి ప్రజలు దాహం దాహం అంటూ కేకలు వేస్తున్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల గత మూడు నెలల నుండి త్రాగునీటి మోటూర్లు పనిచేయక మంచినీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. దగ్గర్లో ఉన్న చేతిపంపులు, నేల బావిల నుండి నీళ్లు తెచ్చుకుని తాగుతున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మూడు నెలల నుండి గ్రామంలో మంచినీరు రావడంలేదని ఇటు ప్రజాప్రతినిధులకు, అటు అధికారులకు ప్రజల మొరపెట్టుకున్న పట్టించుకున్న నాథుడు కరువయ్యాడని ప్రజల వాపోతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు విద్యుత్ స్తంభాల వేసే విషయంలో అధికార పార్టీ నాయకులకు, గ్రామంలో కొంతమందికి ఘర్షణ జరగడం వల్ల విద్యుత్ స్తంభం వెయ్యడం లేదని దాంతో గ్రామంలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో నీటి మోటర్లు పనిచేయక గ్రామస్తులు త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ కార్యదర్శి కి త్రాగినీటి సమస్య తెలిసిన ఇదిగో చేద్దాం అదిగో చేద్దాం అంటూ దాట వేత ధోరణి ప్రదర్శిస్తున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు ప్రతిసారి త్రాగునీటికి మొదట ప్రాధాన్యత కల్పిస్తామని వేదికలపై దంకా బజాయిస్తున్నారు. కానీ గ్రామస్థాయిలో మాత్రం త్రాగినీటి ఇబ్బందులు అధికంగానే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తిమ్మరాజుపేట గ్రామం పై దృష్టి సారించి మంచినీటి కొరత తీర్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

గంజాయి నిర్మూలనపై

# యువతకు అవగాహన కార్యక్రమం

"మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి
మీ జీవితాన్ని, మీ కుటుంబాన్ని, మీ భవిష్యత్తును కాపాడుకోండి"
కోటనందూరు ఎస్సై టి.రామకృష్ణ



**కోటనందూరు, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా కోటనందూరు ఎస్సై టి. రామకృష్ణ మరియు పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో కోటనందూరు మండల పరిధిలో గంజాయి నిర్మూలన మరియు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై టి రామకృష్ణ మాట్లాడుతూ యువతకు గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, విద్య, ఉద్యోగం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల నేరాలకు పాల్పడే అవకాశాలు పెరగడంతో పాటు, చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలియజేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# డాక్టర్ సామ్యూల్ దినకరన్ కాకినాడ రాక



**కాకినాడ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కారుణ్య విద్యాసంస్థల (డీమ్డ్ యూనివర్సిటీ) వైస్ చైర్మన్ డాక్టర్ సామ్యూల్ దినకరన్ అక్టోబర్ 18 నుండి 20 వరకు కాకినాడ మెక్లారిన్ హై స్కూల్ గ్రౌండ్ లో జరిగే సివైఎఫ్ అంతర్జాతీయ యువజన మహోత్సవాలు "క్లిక్ అండ్ కమిట్ -2026"కు హాజరవనున్నారని సివైఎఫ్ డైరెక్టర్ బిహెచ్.వి మూర్తి రాజు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చెడు వ్యసనాలతో జీవిస్తున్న అనేకమందిని సన్మార్గంలో నడిపిస్తున్న దైవజనులు బ్రదర్ సామ్యూల్ దినకరన్, సివైఎఫ్ డైరెక్టర్ డా.బి.హెచ్.వి మూర్తి రాజు యువతకు నైతిక విలువలు గూర్చి బోధించనున్నారు. ఈ సందర్భంగా మూర్తిరాజు మీడియాతో మాట్లాడుతూ మహోత్సవాలలో ప్రపంచవ్యాప్తంగా వాడబడుచున్న ప్రముఖ భారతీయ పియానిస్ట్ కంపోజర్ సంగీత దర్శకుడు స్టీఫెన్ దేవసి, వన్ మేన్ బ్యాండ్ ఇండియా గ్లాడ్సన్ పీటర్ వినూత్న రూపంలో సంగీతాన్ని అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని గాయకులచే "ఏకమ్ సీజన్ 5"ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతోందన్నారు. రక్తదాన శిబిరం, జాబ్ మేళా అదేవిధంగా ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి యువతకు ప్రత్యేక వ్యక్తిత్వ వికాస తరగతులు, మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం అందరికీ బహిరంగ సభ జరుగుతుందని అందరూ ఆహ్వానితులే అని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యువతకు సామాన్యమైన భోజన,వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్ కోఆర్డినేటర్స్ కలవల జాన్ విక్లిఫ్, పాస్టర్ మాసా సుదీర్ సన్నీ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సిస్టర్ ఉషారాణి, సునీల్, సి కె సింగ్,విజయ భాస్కర్, పెయ్యల నాని బాబు, మచ్చా బుజ్జి బాబు, తెలుగు రవి, వారా వినోద్, మధుసూదన్ రావు, వల్లూరి నానాజీ,చైతన్య, లోకేష్, షాలిని, అర్పణ,అను తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం కేసును

# ఛేదించిన కోటనందూరు పోలీసులు

## పోలీస్ సిబ్బందిని అభినందించిన ఉన్నతాధికారులు



**కోటనందూరు, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు, పెద్దాపురం డీఎస్పీ ఏ.బి.జి. తిలక్ మార్గదర్శకత్వంలో, తుని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.చెన్నకేశవరావు పర్యవేక్షణలో కోటనందూరు ఎస్సై టి.రామకృష్ణ మరియు వారి సిబ్బంది నాలుగేళ్ల క్రితం నమోదైన మహిళ అదృశ్యం కేసుపై ప్రత్యేక దృష్టి సారించి, మిస్సింగ్ మహిళను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి.రామకృష్ణ మాట్లాడుతూ కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 09-08-2022 తేదీన, బంగారు పెద తాతిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేయబడిందని, ఈ కేసులో సబ్బవరపు సీతాదేవి భర్త గోవిందు, వయస్సు 32 సంవత్సరాలు, కులం: కొప్పుల వెలమ, రామకృష్ణాపురం గ్రామం, రౌతులపూడి మండలం అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలియజేశారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసుపై ప్రత్యేక శ్రద్ధ చూపించి, ఆర్టిజిఎస్ 360ఓ కెమెరా వ్యవస్థ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు ఇతర టెక్నికల్ ఆధారాలను వినియోగించి మిస్సింగ్ మహిళ ఆచూకీని గుర్తించినట్లు తెలియజేశారు. ఈ క్రమంలో ఈ రోజు సదరు మిస్సింగ్ మహిళను విజయవంతంగా ట్రేస్ చేసి, అవసరమైన విచారణ అనంతరం ఆమెను ఫిర్యాదుదారుడు మరియు కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించడం జరిగిందన్నారు. 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళ అదృశ్యం కేసును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి ఛేదించిన కోటనందూరు పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలియజేశారు.

గౌతమీ జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమంలో ఆదిత్య ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు

# 78 మందికి నూతన వస్త్రాలు, పండ్లు వితరణ



**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమంలో ఆదిత్య ఎన్.ఎస్.ఎస్. మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు ఆగస్టు 26 మదర్ థెరీసా పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం వృద్ధులకు నూతన వస్త్రాలు, బలవర్ధక ఆహారం,పండ్లు వితరణ చేశారు.మహిళలకు చీర జాకెట్,మగవాళ్లకు పంచెలు లుంగీలు , తువాళ్ళు పంచడం జరిగింది. ఉదయం 10:00 కి మొదలైన కార్యక్రమం లో వాలంటీర్లు తాతయ్య గారు,నానమ్మ ,అమ్మమ్మ అంటూ వరుసలు పెట్టి వారి చేతులు పట్టుకుని దగ్గర కూర్చుని, పాదాభివందనాలు చేస్తూ మేమే మీకు మనవలం, మనవరాల్లం అంటూ వారు వారికి ప్రేమను అందించడం విశేషం. అంతేకాకుండా తమ పుట్టినరోజులు వంటి శుభకార్యాలు ఇక్కడికి వచ్చి జరుపుకుంటామని మిమ్ము అప్పుడప్పుడు వచ్చి చూసి పోతామని వారిని ఓదార్చారు.వారితో ఎన్నో విషయాలు ముచ్చటించి జ్ఞాపకాలను గుర్తుకు చేశారు. రాజమండ్రి ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి సరోజ,ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కె.ఎన్. రెహమాన్ ఈ కార్యక్రమానికి సారధ్యం వహించగా, ఆదిత్య ఎన్ఎస్ఎస్ డీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఁ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. వి.ఎస్ నాగేశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బి హెచ్ వి రమాదేవి, పోలుకొండ సాయి, బి. విమల అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కిరణ్ కుమార్, ముఖ్యఅతిథిగా విశిష్ట అతిథి క్రైమ్ బ్రాంచ్ మరియు మహిళా రక్షకు డిఎస్పి ఎ.సుభాష్, సీసీ శ్రీకాంత్ ,ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సుధాకర్ పట్నాయక్, ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ డాక్టర్ జి.ఎన్.వి.ఏ. బి.ఎస్ మహాలక్ష్మి, డాక్టర్ బళ్ల శ్రీనివాస్ ,గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. రామకృష్ణ, విద్యార్థి నాయకులు సమీరా జాహ్నవి పోసి పృథ్వి మరియు 78 మంది వాలంటీర్లు హాజరయ్యారు . డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ తాము గత 26 సంవత్సరాల నుండి ఈ కార్యక్రమాలు చేస్తూనే ఉన్నామని, తాను ఎన్ఎస్ఎస్ పుట్టినప్పటి నుండి వాలంటీర్ గా ప్రోగ్రామ్ ఆఫీసర్ గా సిజిటిఎంలో సేవలు అందించాననీ, తమ అధినేత డాక్టర్ నల్లమెల్లి శేషారెడ్డి కూడా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్గా సేవలు అందించాననీ, తెరిసా పుట్టినరోజు కి ఎప్పుడు ఈ విధంగానే సేవలు చేస్తామని తెలియజేశారు. దీనికి మూల కారణం డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావుఅని, రమాదేవి తదితర ప్రోగ్రామ్ ఆఫీసర్లు క్రమశిక్షణతో చేయడం ఒక కారణమని చెప్పారు.అందుకే ఇంత ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. శ్రీకాంత్ వాలంటీర్స్ ని అభినందిస్తూ ఇంత మంచి కార్యక్రమం లో తనను కూడా కలుపుకుని చేయడం తన అదృష్టమని తెలియజేశారు స్వయంగా దగ్గర ఉండే ఆయన బట్టలు పంపిణీ చేశారు పేరుపేరునా అందరి ఆరోగ్య విషయాలు అడిగి వారి పేర్లను అడిగి జాగ్రత్తగా ఉండమని తగిన సూచనలు ఇచ్చారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్ మాట్లాడుతూ తమ వాలంటీర్లు చూస్తే తనకు గర్వంగా ప్రతి వారం స్వచ్ఛభారత్ వంటి సేవలు చేస్తారని, ఆధ్యాత్మిక సామాజిక సేవలలోను ముందుండటమే కాకుండా అవి వ్యక్తి నైపుణ్యాలు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా తమ కళాశాల ముందు ఉంటుందని ఉద్యోగాల విజయాలు కూడా తమ కళాశాలకే అత్యధిక సంఖ్యలో క్యాంపస్ సెలక్షన్స్ వస్తాయని, తమ అమ్మాయిలు తమకు గర్వకారణం అని చెప్పారు. ఉదయం 10 గంటలకు మొదలైన కార్యక్రమం మధ్యాహ్నం 12:30 గంటలకు ముగిసింది.

# మహిళలు ఇబ్బంది పడే క్యాన్సర్లపై అవగాహన

**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో స్థానిక హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్ నందు బుధవారం మండల అధ్యక్షులు రహమాన్ ఖాన్ అధ్యక్షతన వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిధిగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు విచ్చేసి మాట్లాడుతూ పల్లెల్లో ప్రాధమికంగా వైద్య సేవలందించే పీఎంపీల వృత్తి పరిరక్షణకు జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న అసోసియేషన్ పీఎంపీ అసోసియేషన్ అని, జాతీయ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న స్పార్క్ హాస్పిటల్ కు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ బి స్పందన హాజరై మాట్లాడుతూ మహిళలు నేడు ఇబ్బంది పడే రొమ్ము క్యాన్సర్ గురించి, గర్భాశయ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గురించి వివరించారు,క్యాన్సర్ ను తొలి దశలో గుర్తించాలంటే అవగాహన చాలా ముఖ్యమని అన్నారు.డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితిలలో పీఎంపీలు అందించే బేసిక్ లైఫ్ సపోర్ట్ గురించి, సీపీఆర్ విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పి దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, మండల కోశాధికారి కోల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఎ సురేష్ బాబు, సహాయ కార్యదర్శి సీహెచ్ కామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ బాపూజీ,కె మాసరరాజు,సరోజిని, రాజ్యలక్ష్మి, హీరా,ఎస్కే రహమాన్ సాహెబ్, కె వెంకటేశ్వరరావు,ఎమ్ పార్థసారథి, యు ప్రసాద్ బాబు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రవికిరణ్,డాక్టర్ స్పందన లను సత్కరించారు.

# మన ఊరు-మన బీజేపీ జెండా ఆవిష్కరణ



**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్వర్యంలో మన ఊరు - మన జెండా, బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం క్వారీ మార్కెట్ దుర్గమ్మ గుడివద్ద బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షులు,ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి జండా ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర,రేలంగి దేవి, బొమ్ములు దత్తు ఎమ్మెస్ కే రాజు, కురగంటి సతీష్, కాలేపు సత్య సాయిరాం, వీర వీరాంజనేయులు, ఎర్ర నాగదేవి, నీలప్రసాద్, తగరం సురేష్ బాబు, బాబ్జి మాస్టర్, రవిశంకర్, పడాల నాగరాజు, బూర రామచంద్రరావు, మోహిని, స్వామి సూర్యకిరణ్ ,బండి సత్య ప్రసాద్, నందివాడ సత్యనారాయణ, గుర్రాల వెంకట్రావు ,తన్నుద్ధి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమైన డాక్యుమెంట్లు గల సంచి పోయినది

మేడపాటి వీర వెంకట శివరామకృష్ణా రెడ్డి కు చెందిన ఎరుపు రంగు సిఎంఆర్ షాపింగ్ మాల్ సంచి 26-08-2026న సామర్లకోట-తుని రైలు ప్రయాణంలో చోరీకి గురైంది. రైలు నంబర్ 67285 రాజమండ్రి-విశాఖపట్నం వీజువీఖ జనరల్ బోగీలో సామర్లకోటలో రైలు ఎక్కిన అనంతరం సీటుపై సంచిని ఉంచి వాష్‌రూమ్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి సంచి కనిపించలేదు. సంచిలో రామచంద్రాపురం ఎస్ఆర్వోకు సంబంధించిన డాక్యుమెంట్ నం. 3926/2025, 2104/2023, అనపర్తి ఎస్ఆర్వో డాక్యుమెంట్ నం. 1424/2022 ఒరిజినల్స్, ఆధార్, పాన్ కార్డు, ఎస్‌బిఐ మాచవరం బ్రాంచ్ పాస్‌బుక్ ఉన్నాయి. పై డాక్యుమెంట్లు ఎవరికైనా లభించినా లేదా సంచి ఆచూకీ తెలిసినా దయచేసి వెంటనే క్రింది నంబర్‌కు సమాచారం ఇవ్వగలరు.

-: సంప్రదించవలసిన నెంబర్లు :-

**9441615555, 9866401678**



# గోకవరంలో 75 లక్షల గంజాయి లిక్విడ్ పట్టివేత

**నలుగురు అరెస్ట్..కారు, మోటార్‌సైకిల్ స్వాధీనం**

**ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసుల వలలో.. - మరో ముగ్గురి కోసం గాలింపు**






**గోకవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా లిక్విడ్ గంజాయి (హష్ ఆయిల్) పట్టుబడింది. తంటికొండ ఆర్చ్ వద్ద బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో సుమారు రూ.75 లక్షల విలువైన 6 కిలోల లిక్విడ్ గంజాయిని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు, రవాణాకుఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు, గ్లామర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనపరచకున్నారు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు గోకవరం ఎస్సై వి.ఎన్.వి. పవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి గంజాయి అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తంటికొండ ఆర్చ్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వాహనాలను తనిఖీ చేయగా హష్ ఆయిల్ తరలిస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ వివరాలను ఉత్తర మండల డీఎస్పీ సి.హెచ్. జీవన బుధవారం వెల్లడించారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు తరలింపుపోలీసుల విచారణలో నిందితులు ఒడిశా ప్రాంతం నుంచి లిక్విడ్ గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్ కు తరలించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. పోలీసులకు అనుమానం రాకుండా ముందుగా మోటార్ సైకిల్ పై ఇద్దరిని పంపించి, పోలీసుల కదలికలను గమనిస్తూ.. వెనుక కారులో హష్ ఆయిల్ ను తరలించేలా పక్కా ప్రణాళిక రూపొందించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో సపుర హంతల్, జాదవ్ యోగేష్, రాహుల్ ముస్తాపురా, అముదాల వినయ్ నల్లొడు అరెస్టయ్యారు. వీరిపైఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లుపోలీసులు తెలిపారు.మరో ముగ్గురి కోసం గాలింపు ఈ కేసులో లింగు ఖిల్లా, ప్రశాంత్ ముస్తాపుర, సంట్రా ఖిల్లా సమురా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి సరఫరా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ వెల్లడించారు. నిందితుల పై గతంలో కేసులు, అరెస్టయిన నిందితుల్లో కొందరిపై గతంలోనూ గంజాయి అక్రమ రవాణా, ఇతర నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఎ-1 పై రంపచోడవరం, వై.రామవరం పోలీస్‌స్టేషన్లలో ఎన్‌డీపీఎస్ కేసులు ఉండగా, ఎ-2, ఎ-3పై తెలంగాణలోని అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ కేసు ఉన్నట్లు వెల్లడించారు. ఎా-4పై గండేపల్లి, బొమ్మూరు, రాజానగరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు గత ఏడాది నుంచి ఇప్పటివరకు గోకవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 7 కేసులు నమోదు చేసి సుమారు 20 మంది నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి సుమారు 600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గంజాయి వినియోగిస్తున్నట్లు అనుమానించిన సుమారు 20 మందికి ర్యాపిడ్ టెస్ట్‌ల ద్వారా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారిని కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి సిహెచ్ జీవన, సర్కిల్ ఇన్స్పెక్టర్ మూర్తి, ఎస్సై పవన్ కుమార్, ఎస్ఐ బి నాగమణి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**జగన్మోహన్ రెడ్డిని**

# మర్యాదపూర్వకంగా కలిసిన గణేశుల



**కోరుకొండ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్ఆర్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు మండల కో కన్వీనర్ గణేశుల పోశయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం విజయవాడలోని వైఎస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో వైయస్సార్సీపి శ్రేణులు వ్యవహరించవలసిన తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు వైకాపా నాయకులు వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో పలువురు వైకాపా నాయకులు, జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, జక్కంపూడి రాజా, గణేశుల పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

**బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించడంపై**

# చంద్రబాబుకు కృతజ్ఞతలు

**తెలుగుదేశం అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలుస్తాం**



**కోరుకొండ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి నేటి వరకు బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించి, వారి అభ్యున్నతికి ఎల్లవేళలా కృషిచేస్తున్న తెలుగుదేశం పార్టీకి బీసీలందరూ రుణపడి ఉంటామని కోరుకొండ మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తనకాల నాగేశ్వరరావు మద్దాల రమణ తదితరులు తెలిపారు. బుధవారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తనకాల నాగేశ్వరరావు, మద్దాల రమణ తదితరులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్, 24%కి తగ్గించి బీసీలకు అన్ని విధాలుగా తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించడం పై కృతజ్ఞతలు తెలియజేస్తూ, తెలుగుదేశం పార్టీకి బీసీల అందరం వెన్నుదన్నుగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దిడ్డి మాధవరావు, మల్ల అప్పలనరసరావు, రాపేటి సూర్యచంద్రం, పిల్ల సుందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**క్లస్టర్-4లో ఇంటింటికి తెలుగుదేశం**

# 100% పూర్తి పూర్తి చేసినందుకు సత్కారం

**త్వరలో 3లక్షల పెన్షన్లు, ఇళ్ల స్థలాలు : బొద్దు వెంకటరమణ చౌదరి**





**కోరుకొండ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ రెండేళ్ల పాలనలో సాధించిన ప్రగతి, అభివృద్ధి సంక్షేమాన్ని ప్రతి ఇంటికి తెలియజేస్తూ ప్రజల అవసరాలు తెలుసుకోవడానికి ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న "ఇంటింటికి-తెలుగుదేశం"కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లాఅధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొద్దు వెంకటరమణ చౌదరి తెలిపారు. బుధవారం బూరుపూడి గేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజానగరం నియోజకవర్గ స్థాయిలో ఉన్న పది క్లస్టర్లలో, క్లస్టర్-4 ఇంటింటికి కార్యక్రమాన్ని 100% మొట్టమొదటిసారిగా పూర్తి చేసిందని క్లస్టర్ ఇంచార్జ్ అడపా వీరబాబు, యూనిట్ ఇన్చార్జిలను, బూత్ ఇన్చార్జిలను బొద్దు తదితరులు అభినందిస్తూ, పూలమాలవేసి సాల్వో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొద్దు మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోపు సుమారు మూడు లక్షల మందికి పెన్షన్లు ఇవ్వనున్నారని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు, ఇంటిలోను ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ కలిసికట్టుగా పని చేస్తూ, అన్ని స్థానాల్లో ఎన్డీఏ అభ్యర్థులు విజయం సాధించడానికి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ పార్టీ ఇంచార్జ్ సూరిబాబు,తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబు రాయుడు, పుప్పాల వెంకటరత్నం, మద్దాల రమణ, బుద్ధ బాపూజీ, పిల్ల సుందర్ సింగ్, వల్లేపల్లి దుర్గారావు, బండి ప్రసాద్, మాతా సీతారాముడు, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్ర పరిశ్రమ సీనియర్ ఆర్టిస్ట్ పైలకు పలువురు ఘనంగా నివాళులు



**కోరుకొండ, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** చిత్ర పరిశ్రమ సీనియర్ ఆర్టిస్ట్ సీనియర్ ఫోటోగ్రాఫర్ పైల సత్యనారాయణ కుమార్ ఇటీవల స్వర్గస్తులైన విషయం పాఠకుల అందరికీ విధితమే. బుధవారం ఆయన పెద్ద కార్యం కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పరిశ్రమకు సంబంధించిన వివిధ రంగాల ఆర్టిస్టులు, కోరుకొండ రాజమండ్రి పరిసర ప్రాంతాల ఫోటోగ్రాఫర్లు, కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి భక్తులు, పెద్ద ఎత్తున విచ్చేసి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మృతుడి కుటుంబసభ్యులు, ఫోటోగ్రాఫర్లు, చిత్ర పరిశ్రమ ఆర్టిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం

**రాయవరంలో ఘనంగా మదర్ థెరిసా 116వ జయంతి వేడుకలు**



**రాయవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే మదర్ థెరిసాకు మనమిచ్చే ఘనమైన నివాళి అని వాలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాయవరంలోని మదర్ థెరిసా 116వ జయంతి వేడుకలను మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాలంటరీ బ్లడ్ ఒ ఐ డోనర్స్ అధ్యక్షులు వెలగల ఫణికృష్ణారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెలగల ఫణికృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మదర్ థెరిసా సేవా సంస్థ ద్వారా అనాథలు, అభాగ్యులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో సంస్థ నిర్వాహకులు, యువత చూపిన దాతృత్వం, సేవా స్ఫూర్తిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవ చేస్తూ, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే మదర్ థెరిసాకు మనమిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం వృద్ధులు, చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంస్థ అధ్యక్షులు చంద్రమళ్ల సంజయ్ రాజు, ఉపాధ్యక్షులు దువ్వ చంద్రశేఖర్, సెక్రటరీ కందుకూరి గంగరాజు, ట్రెజరర్ చంద్రమళ్ల రాజు, పలివెల సురేష్, చంద్రమళ్ళ సుధాకర్, చంద్రమళ్ళ పవన్ తదితరులు పాల్గొన్నారు.


**ప్రెస్ క్లబ్‌లో ప్రారంభమైన**

# 15 లక్షల ప్రమాద బీమా పథకం



**రాజమహేంద్రవరం, ఆగస్టు 26, విశ్వం వాయిస్ న్యూస్ :** ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ మిత్రులందరికీ ప్రమాద బీమా ఇన్స్యూరెన్స్ కట్టించే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఒక్కొక్కరికి 15 లక్షల ప్రమాద బీమా వర్తించేలా ఈ పాలసీ ఉంటుంది.దీని నిమింత్తం ఒక్కొక్కరికి అయ్యే పూర్తి ఎమౌంట్ రూ. 799 చొప్పున ప్రెస్ క్లబ్ ద్వారానే చెల్లించబడుతుంది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు రెగ్యులర్ గా కొన్ని రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీనిని గుర్తించి, ప్రెస్ క్లబ్ లో సభ్యులైన ప్రతి ఒక్కరు ఒరిజినల్ ఆధార్ కార్డు, పాన్ కార్డు లతోపాటు.. వాళ్ల నామిని ఒరిజినల్ ఆధార్ కార్డు కూడా తీసుకుని నేరుగా ప్రెస్ క్లబ్ వద్దకు వచ్చి బీమా పాలసీని పొందగలరు. అయితే, దీనిని పూర్తి చేసే సమయంలో మీ ఫోన్ పే లో రూ. 799 నగదు ఉంచుకుని రావలి. పాలసీ కట్టిన వెంటనే అక్కడే తిరిగి రూ. 799 మీకు చెల్లిస్తారు.ఈ పాలసీ నిమిత్తం మీరు ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం పోస్టాఫీస్, ప్రెస్ క్లబ్ ద్వారా ఇదే పాలసీని గతంలో పొందిన వారు కూడా మళ్లీ ఈ పాలసీ తీసుకోవచ్చని, అప్పుడు 10 లక్షలు మీకు బీమా వచ్చేలా తీసుకుని ఉంటే, ఈ 15 లక్షలు కలిపి మీకు 25 లక్షలు బీమా వర్తిస్తుంది.





# కియారా అదృష్టవంతురాలివి..

### ఆ అట్టర్ ఫ్లాప్ సినిమాను మిస్సయ్యావు..

ఎట్టకేలకు టాక్సిక్ సినిమా అడియన్స్ ముందుకు వచ్చేసింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రాకింగ్ స్టార్ యశ్ నటించిన ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ మూవీకి ఉదయం నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. ముఖ్యంగా ఈ మూవీలో స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది కియారా. అందం, అబినయంతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. భారీ అంచనాల మధ్య ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది టాక్సిక్ సినిమా. డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రాకింగ్ స్టార్ యశ్ నటించిన ఈ సినిమా ముందు నుంచి మంచి హైప్ ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో కియారా అద్వానీ, నయనతార, రుక్మిణి వసంత్ కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాతో సౌత్ ఇండస్ట్రీలోకి సాలిడ్ కంబ్యాక్ ఇచ్చింది కియారా. ఇదెలా ఉంటే.. ఇటీవల జిగిన టాక్సిక్ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో దర్శకుడు తన సొంత సినిమా ఫెయిల్యూర్ గురించి ప్రస్తావించి అందరి దృష్టిని ఆకర్షించారు. నటి కియారా అద్వానీని ఉద్దేశించి, తాను గతంలో చెప్పిన కథను కియారా అంగీకరించకపోవడం తనకే మంచిదైందని ఆయన సరదాగా అన్నారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. 'టాక్సిక్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో వేదికపై మాట్లాడుతూ, విఘ్నేష్ శివన్ కియారా అద్వానీ వైపు చూస్తూ ఒక పాత సంఘటనను గుర్తుచేసుకున్నారు. 'కబీర్ సింగ్' విడుదలకు ముందు తాను కియారాకు ఒక కథ చెప్పడానికి వెళ్ళానని ఆయన అన్నారు. కానీ కియారా ఆ కథను అంగీకరించలేదు. ఆ తర్వాత, విఘ్నేష్ శివన్ అదే కథను 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సినిమాగా తీశారు. ఈ సంఘటనను గుర్తుచేసుకుంటూ, ఆ సినిమాలో కియారా నటించకపోవడం ఆమె అదృష్టమని ఆయన సరదాగా అన్నారు. విఘ్నేష్ శివన్ నేరుగా కియారాతో మాట్లాడుతూ, "నువ్వు చాలా అదృష్టవంతురాలివి. ఎందుకంటే నువ్వు ఆ సినిమాలో నటించలేదు" అని అన్నారు. ఒకవేళ కియారా ఆ సినిమాలో నటించి ఉంటే, ఆ సినిమా వైఫల్యం కూడా ఆమె కెరీర్ ఖాతాలో చేరి ఉండేదని ఆయన సరదాగా అన్నారు. విఘ్నేష్ మాటలు విని కియారా కూడా నవ్వింది. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినప్పటికీ, అతను దాని గురించి ఏమాత్రం సిగ్గుపడకుండా మాట్లాడటం అతని నిరాడంబరతను, హాస్య చతురతను తెలియజేస్తుందని కొందరు అన్నారు. టాక్సిక్ షోలో విఘ్నేష్ శివన్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్‌లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అతను కియారా ముందే తన సినిమా ఫెయిల్యూర్ గురించి ప్రస్తావించడం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది.

### త్రివిక్రమ్ శ్రీనివాస్ చెప్పిన

# మరో గొప్ప జీవిత పాఠం..



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అనగానే సినిమాలతో పాటు ఆయన నోటి నుంచి వచ్చే పదునైన మాటలు, డైలాగులే బాగా గుర్తుంటాయి. తాజాగా ఆయన తన సినిమా ఫెయిల్యూర్ టైంలో తనకు తన భార్య, పిల్లల మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. మాటల మాంత్రికుడు, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఆయన సినిమాలతో పాటు అందులో ఆయన చెప్పిన పదునైన మాటలు, డైలాగులు చాలా బాగా గుర్తుండిపోతాయి. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్లలోనూ త్రివిక్రమ్ చెప్పే మాటలు, ఇచ్చే స్పీచులు ఎంతో ఆసక్తికరంగా ఉండిపోతాయి. అలా తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఓ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు మాటల మాంత్రికుడు. ఈ సందర్భంగా ఆయన ఫెయిల్యూర్స్ ను ఎలా తీసుకోవాలో సూచిస్తూ ఓ అద్భుతమైన ప్రసంగం ఇచ్చారు. ఈ సందర్భంగా తన కెరీర్ లో ఫ్లాప్ గా నిలిచిన అజ్ఞాత వాసి సినిమాను ఉదహరిస్తూ ఆ సమయంలో తనకు తన భార్య, పిల్లల మధ్య జరిగిన సంభాషణను పంచుకున్నారు. ఫెయిల్యూర్‌ని దాచి పెట్టడం వల్ల మనసు ఎక్కువ బరువుగా అనిపిస్తుంది. నేను ఇల్లు కట్టుకుంటోన్న సమయంలోనే 'అజ్ఞాతవాసి' సినిమాను తెరకెక్కించాను. ఇది ఫ్లాప్ అవ్వడంతో సినిమా రిలీజైన 24 గంటల్లోనే రెమ్యునరేషన్ మొత్తం వెనక్కిచ్చేయాల్సి వచ్చింది. నిర్మాత కూడా తనకు మిగిలిన లాభం వెనక్కిచ్చేశాడు. పవన్ కల్యాణ్ కొంత రెమ్యునరేషన్ వెనక్కిచ్చారు. అలా మొత్తం అందరికీ సెటిల్ చేసేశాం. అయితే ఈ విషయాన్ని నా భార్య, పిల్లలకు చెప్పడం ముఖ్యం అనుకున్నాను. నేనో సినిమా తీశాను అది ఆడలేదు. కాబట్టి మనం కడదామనుకుంటున్న ఇల్లు ఆపేద్దామనుకుంటున్నాను. మీకేమైనా సమస్యనా? రేపొద్దునా తేడా ఏమైనా వస్తే దాన్ని అమ్మేస్తానని అనగానే.. ఇది ఉంది కదా ఇది కూడా ఇల్లే కదా అని అన్నారు. దీంతో అది సమస్య కాదని అనిపించింది . ఆ తర్వాత భోజనం చేసి సంతోషంగా ఓ సినిమా చూసి పడుకున్నాను' 'సినిమా పోయిన విషయాన్ని దాచి పెట్టి యజమానిగా ఇప్పుడా అదనంగా ఆ బరువుని కూడా మోయాలి. ఇదెవరికీ చెప్పకూడదు. భార్య, పిల్లలకు తెలియకూడదు. తెలియకూడదని మనం అనుకోవడం తప్ప ప్రపంచానికి అంతా తెలిసిన తర్వాత ఇంట్లో వాళ్లకు ఎందుకు తెలియకుండా ఉంటుంది. ముందు వాళ్లకే కదా తెలుస్తుంది. కాకపోతే గౌరవంతో వాళు మనకు చెప్పరంతే. చెప్పేయడం వల్ల మనకు ముందు మన మనసు తేలిగ్గా ఉంటుంది. ఇదేమైనా పెద్ద సమస్య అనే ఫీలింగ్ వాళ్లకు అనిపించదు. లేదంటే వాళ్లు కూడా వీడెందుకు మొహం అలా పెట్టుకుని లోపల అలా కూర్చున్నాడు బయటకు రావట్లేదు ఏంటిది అని వాళ్లు కూడా వాళ్లింట్లోనే వేరే వాళ్ల ఇంట్లో ఉన్నట్లు చూస్తారు. ఇదంతా ఎలా ఉంటుందంటే.. సినిమా మనం తీసి టార్చర్ వాళ్లకు పెట్టినట్లు ఉంటుంది' అని జీవిత సారాన్ని వివరించారు త్రివిక్రమ్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

# సెమీఫైనల్స్‌లో తలపడే 4 జట్లు ఇవే.. దేశవాళీలో ఇక రచ్చరచ్చే..!

దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్ ముగిశాయి, తూర్పు, ఉత్తర జోన్ జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఆగస్టు 30న బెంగళూరులో రెండు సెమీఫైనల్స్ జరగనున్నాయి. మొదటి సెమీఫైనల్‌లో, సెంట్రల్ జోన్ (రజత్ పాటిదార్ కెప్టెన్సీ) ఈస్ట్ జోన్ (ఇషాన్ కిషన్ కెప్టెన్సీ)తో తలపడుతుంది. రెండవ సెమీఫైనల్‌లో, సౌత్ జోన్ (తిలక్ వర్మ కెప్టెన్సీ) నార్త్ జోన్‌తో తలపడుతుంది. బెంగళూరులో జరుగుతున్న దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ రౌండ్ ముగిసింది. ఈ రౌండ్‌లోని మొదటి మ్యాచ్‌లో, ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ జట్టు ఒక ఇన్నింగ్స్ 210 పరుగుల తేడాతో విజయం సాధించగా, రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్ జట్టు వెస్ట్ జోన్ జట్టును 52 పరుగుల తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించింది. దీంతో ఈస్ట్ జోన్, నార్త్ జోన్ జట్లు రెండూ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి.




**మొదటి సెమీ-ఫైనల్ మ్యాచ్..**

దులీప్ ట్రోఫీ మొదటి సెమీ-ఫైనల్ ఇప్పుడు ఆగస్టు 30న జరగనుంది. ఇందులో సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్ దీజజ× సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లోని గ్రౌండ్ 1లో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. సెంట్రల్ జోన్ జట్టుకు రజత్ పాటిదార్ నాయకత్వం వహించగా, ఈస్ట్ జోన్ జట్టుకు ఇషాన్ కిషన్ సారథ్యం వహించనున్నారు.

**రెండవ సెమీ-ఫైనల్ మ్యాచ్..**

అదేవిధంగా, రెండవ సెమీ-ఫైనల్ మ్యాచ్ సౌత్ జోన్, నార్త్ జోన్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ కూడా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (గ్రౌండ్ 2లో ఆగస్టు 30న ప్రారంభమవుతుంది. సౌత్ జోన్ జట్టుకు తిలక్ వర్మ, నార్త్ జోన్ జట్టుకు కన్హయ్య వాధవన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఈ మ్యాచ్ కూడా ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది.

**4 జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి..**

సెంట్రల్ జోన్ జట్టు: రజత్ పాటిదార్ (కెప్టెన్), రింకు సింగ్ (వైస్ కెప్టెన్), ఆర్యన్ జువల్ (వికెట్ కీపర్), శరాన్‌షా జైన్, అమన్ మొఖడే, కునాల్ చండేలా, జీషన్ అన్సారీ, ఆర్యన్ పాండే, అర్షద్ ఖాన్, ఆయుష్ పాండే, యశ్ సింగ్ రాథోడ్, యశ్ రాథోడ్, పర్వ్ రాథోడ్, పర్వ్ రాథోడ్

**స్టాండ్‌బై ఆటగాళ్లు:** అమన్‌దీప్ ఖరే, మయాంక్ మిశ్రా, సౌరభ్ రావత్, భార్గవ్ మెరాయ్, కునాల్ యాదవ్, కుమార్ కార్తికేయ.

**ఈస్ట్ జోన్ జట్టు:** అభిమన్యు ఈశ్వరన్, సుదీప్ ఘరామి, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, షాబాజ్ అహ్మద్, సూరజ్ జైస్వాల్, ఇషాన్ కిషన్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ (వైస్ కెప్టెన్), విరాట్ సింగ్, కుమార్ కుషాగ్రా, శిఖర్ మోహన్, సుబ్రాన్షు సేనాపతి, అభిజిత్ ద రోకర్, అనీషుర్ ద రోకర్.

**స్టాండ్‌బై ఆటగాళ్లు:** ఆయుష్ లోహరుక, శ్రీదమ్ పాల్, సంబిత్ ఎస్ బరల్, శరణ్‌దీప్ సింగ్, స్వస్తిక్ సమల్.

**సౌత్ జోన్ జట్టు:** తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్, అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె. హిమతేజ, స్మరణ్ రవిచంద్రన్, ఎన్. జగదీషన్, కరుణ్ నాయర్, టి. త్యాగరాజన్, శ్రేయాస్ గోపాల్, సాయి తేజ, టి. విజయ్, విద్వాత్ కావేరప్ప, అమన్ ఖాన్.

**నార్త్ జోన్ జట్టు:** కన్హయ్య వాధావన్ (కెప్టెన్), ఆయుష్ బదోని (వైస్ కెప్టెన్), సనత్ సాంగ్వాన్, కమ్రాన్ ఇక్బాల్, యశ్ ధుల్, ఆయుష్ దోసెజా, అబ్దుల్ సమద్, నిషాంత్ సింధు, అర్జున్ శర్మ, అబిద్ ముస్తాక్, అర్ష్‌దీప్ సింగ్, సునీల్ కుమార్, అన్షుల్ కాంబోజ్, యుధ్‌వీర్ సింగ్, యుధ్‌వీర్ సింగ్‌ప్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

# రిషబ్ పంత్‌కు ప్రమోషన్.. బుమ్రా, జైస్వాల్‌లకు డిమోషన్..!



ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో రిషబ్ పంత్ భారీగా దూసుకెళ్లాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో తన ప్రదర్శన తర్వాత, అతను 711 రేటింగ్ పాయింట్లతో శుభ్‌మన్ గిల్‌తో సమానంగా 7వ స్థానానికి చేరుకున్నాడు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని కోల్పోగా, మిచెల్ స్టార్క్ నెం. 1 స్థానానికి చేరుకున్నాడు. యశస్వి జైస్వాల్ టాప్ 10 నుంచి బయటకు వచ్చేశాడు. టీమ్ ఇండియా ఆటగాడు రిషబ్ పంత్ ఐసీసీ టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకాడు. శ్రీలంకతో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న కీపర్-బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్, ర్యాంకింగ్స్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో సమంగా నిలిచి, ఇప్పుడు టాప్ 10లో చేరాడు. ఈ టెస్ట్ సిరీస్‌కు ముందు టాప్ 10లో కూడా లేని రిషబ్ పంత్, ఇప్పుడు 711 రేటింగ్ పాయింట్లతో ఆరు స్థానాలు ఎగబాకి ఏడవ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో, శుభ్‌మన్ గిల్‌కు కూడా 711 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. దీని ప్రకారం, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం 7వ స్థానంలో ఉన్నారు. గాలెలో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో రిషబ్ పంత్ తొలి ఇన్నింగ్స్‌లో 39 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 66 పరుగులు సాధించాడు. ఫలితంగా, పంత్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎగబాకాడు. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు ఇన్నింగ్స్‌లలోనూ పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడటంలో విఫలమయ్యాడు. గిల్ తొలి ఇన్నింగ్స్‌లో 16 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం ఎనిమిది పరుగులు మాత్రమే చేయగలిగాడు. గాలే టెస్టులో ఆశించిన స్థాయిలో రాణించని యశ్వహి జైస్వాల్ టాప్ 10 నుండి బయటకు పడిపోయాడు. రెండు స్థానాలు దిగజారిన జైస్వాల్, 701 రేటింగ్ పాయింట్లతో 11వ స్థానానికి పడిపోయాడు. భారత్, శ్రీలంక మధ్య జరిగిన రెండో టెస్టులో చేసిన పరుగులను ఈ ర్యాంకింగ్‌లో పరిగణనలోకి తీసుకోలేదు. దీని కారణంగా ర్యాంకింగ్ జాబితాలో మార్పులు జరిగాయి. ఈలోగా, బౌలర్ల ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా తన అగ్రస్థానాన్ని కోల్పోగా, ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. బుమ్రా మినహా, టాప్ 10లో మరే ఇతర భారత బౌలర్ లేడు. టాప్ 20లో, మహమ్మద్ సిరాజ్ నాలుగు స్థానాలు దిగజారి 18వ స్థానానికి, రవీంద్ర జడేజా మూడు స్థానాలు దిగజారి 19వ స్థానానికి పడిపోయారు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com